క్షణం క్షణం.. నిఖార్సైన సమాచారం..
1
శుక్రవారం 8 -05- 2026

## పాపం ఆ ముగ్గురూ..



- రాజకీయాల్లో రాణించలేకపోయిన దిగ్గజ స్టార్స్
- చిరంజీవి, రజనీకాంత్, కమల్ హాసన్
- పర్వాలేదనిపించిన పవన్ కళ్యాణ్
- ఫుల్ మార్క్ చూపిన విజయ్

3



# ముగిసిన ముగ్గురి కథ

కేసీఆర్--జగన్--స్టాలిన్ స్నేహం ముగ్గురికీ రాజకీయంగా మైనస్ అయిందా?

- అహంకార రాజకీయాలకు ప్రజల తీర్పు...
- వరుసగా ముగ్గురు సీఎంల పరాజయం
- ప్రత్యర్థుల అణచివేతే బూమరాంగ్...
- కేసీఆర్ తర్వాత జగన్, ఇప్పుడు స్టాలిన్
- ప్రజలకు దూరమైన నేతలకు షాక్...
- తమిళనాడు ఫలితాల్లో స్పష్టమైన సందేశం
- ప్యాలెస్ పాలన, రాజకీయ అహంకారం...

ముగ్గురు నేతల ఓటమిపై ఆసక్తికర విశ్లేషణ

### రాజకీయాల్లో హత్యలుండవు..



"ఆత్మహత్యలే ఉంటాయంటారు. ఈ మాట ఇప్పుడు దక్షిణాది రాజకీయాల్లో అక్షర సత్యమైంది. ఒకరిని చూసి ఒకరు, ఒకరి ప్రోత్సాహంతో మరొకరు.. ఇలా 'అహంకారం' అనే ఒకే బాటలో నడిచిన ముగ్గురు మిత్రుల రాజకీయ ప్రస్థానం ఇప్పుడు పరాజయాల పాలైంది. 2023లో తెలంగాణలో కేసీఆర్, 2024లో ఏపీలో జగన్.. ఇప్పుడు 2026లో తమిళనాడులో స్టాలిన్.. ఒకరి తర్వాత ఒకరు ప్రజల ఆగ్రహానికి గురై కుప్పకూలారు. ఒకే భావజాలం, ఒకే రకమైన 'అహంకార' ఆభరణం ధరించిన ముగ్గురు మిత్రుల కథ ఇప్పుడు ప్రజలకు సుఖాంతం.. వారికి దుఃఖాంతం అయింది.

4

## అమరావతిపై సాక్షి సెల్ఫ్ గోల్..!

- వ్యతిరేక కథనంతోనే రూ.2.5 లక్షల కోట్ల విలువ బయటపెట్టిందా?
- గజం రూ.50 వేలు అంటూ సాక్షి కథనం
- వ్యతిరేక వార్తలోనే అమరావతి భారీ విలువ వెల్లడి
- ప్రభుత్వ భూముల విలువ రూ.2.5 లక్షల కోట్లంటూ చర్చ
- వైసీపీ వైఖరిపై టీడీపీ కౌంటర్
- అమరావతిపై రాజకీయ రగడ మరింత ముదిరింది

2

## విజయ్ కి ఖర్చు తడిసి మోపెడు


- మహాబలిపురం రిసార్ట్ లోనే టీవీకే ఎమ్మెల్యేలు
- ప్రతిరోజు లక్షల్లో వ్యయం
- ప్రభుత్వ ఏర్పాటు పై ఇంకా సందిగ్ధత
- ఇంకా కొన్ని రోజులు రిసార్ట్ లోనే ప్రజా ప్రతినిధులు
- మూడంచెల భద్రత కల్పిస్తున్న టీవీకే నేతలు



6

# సెట్ రైట్ చేస్తున్న రేవంత్

- ఒకవైపు సంక్షేమ పథకాలు మరోవైపు కులాలకు కార్పొరేషన్ పదవులు
- విశ్రాంత ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే దిశగా సంకేతాలు
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు
- సంక్షేమం, అభివృద్ధిలో దూసుకెళుతున్న రేవంత్



**పెరిగిపోయిన అప్పులు..** వాటిని తీర్చాలంటేనే బోలెడు తిప్పలు.. మరోవైపు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు.. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికుల నిరసనలు.. సవాల్ విసిరుతున్న ఆర్థిక లోటు.. రాబడిని ఎలా పెంచుకోవాలో తెలియక తలపోటు.. ఇదిగో ఇన్ని సమస్యలను రేవంత్ చాకచక్యంగా పరిష్కరించుకుంటున్నారు.. తనకు తెలిసిన దారిలో కాకుండా.. అందరికీ ఆమోదయోగ్యమైన విధంగానే వీటన్నింటిని పరిష్కరించుకుంటూ వస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా రికార్డు స్థాయిలో ఇళ్లను నిర్మిస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటుచేసి పదవులను భర్తీ చేశారు. ఇకపై నామినేటెడ్ పదవుల విషయంలో ఇదే దూకుడు తనని ప్రదర్శిస్తామని సంకేతాలు ఇస్తున్నారు రేవంత్.

ఓకే తెలుగు, తెలంగాణ బ్యూరో

5

# ప్రజల్లోకి లోకేష్

## పరిపూర్ణ నాయకుడిగా...



(ఓకే తెలుగున్యూస్)

యువ నాయకుడు లోకేష్ ప్రభావం ఇప్పుడు ఏపీలో కనిపిస్తోంది. జాతీయస్థాయిలో కూడా ఆయన పేరు వినిపిస్తోంది. మొన్ననే ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా అయ్యారు. పేరుకే టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. కానీ ఆయనకు మించి అన్నట్టు లోకేష్ వ్యవహారం నడుస్తోంది. ఆయన కనుసన్నల్లోనే పార్టీ ఉంది. పార్టీ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పార్టీపై పూర్తి పట్టు సాధించారు లోకేష్. ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో మాస్ లీడర్ గా ఎదగాలని గట్టి ప్రయత్నం లో ఉన్నారట నారా లోకేష్. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్ర చేపట్టారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. ఇప్పుడు మంత్రిగా ఉండడంతో పాటు పార్టీ బాధ్యతలు తీసుకున్న దృష్ట్యా.. మరింత ప్రభావంతమైన నేతగా మారాలన్న ఆలోచనలో లోకేష్ ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రారంభంలో ఇబ్బందులు..**

లోకేష్ పొలిటికల్ ఎంట్రీ సమయంలో ఆయన ఒక సాధారణ వ్యక్తి. చంద్రబాబు తనయుడు మాత్రమే. రాజకీయ వారసుడు అనిపించుకోలేకపోయారు. చాలా ఇబ్బందులు పడ్డారు కూడా. పైగా చంద్రబాబు లోకేష్ ను ఎమ్మెల్సీ చేసి ఆపై మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కాకుండా పరోక్షంగా ఆయనకు పదోన్నతి కల్పించారు. లోకేష్ కెరీర్ కు అది కూడా ఒక రకమైన ఇబ్బందికరమే. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులంతా లోకేష్ ను వ్యతిరేకించడం ప్రారంభించారు. ఆయన వ్యక్తిత్వాన్ని కూడా హననం చేశారు. నిత్యం వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. అయితే అన్నిం టిని మించి అన్నట్టు రాటు తేలారు నారా లోకేష్. రాజకీయంగా పూర్తిగా పట్టు సాధించారు. వ్యక్తిగతంగా తన శరీర ఆకృతిని మార్చు కున్నారు. పరిపూర్ణమైన నాయ కుడిగా ఎదిగారు.

**మాస్ లీడర్ గా ఎదిగేందుకు..**

రాజకీయాల్లో మాస్ లీడర్ గా ఎదిగితేనే నాలుగు కాలాలపాటు గుర్తిస్తారు. అయితే చంద్రబాబు పాలనా థక్షుడు. ఆయన మాస్ లీడర్ కాదు. ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న చంద్రబాబు ఇప్పుడు చివరి దశలో మాత్రం చాలా గౌరవాన్ని దక్కించుకున్నారు. అయితే చంద్రబాబు మాదిరిగా కాకుండా లోకేష్ ఒక మాస్ లీడర్ గా ఎదగాలి అంటే ప్రజలతో మమేకమై పని చేయాల్సి ఉంటుంది. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకొని ఇప్పుడు లోకేష్ ప్రజల మధ్యకు వచ్చేందుకు పక్కాగా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ పార్టీని అభివృద్ధి చేయడమే కాదు ప్రజల్లో తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారట. త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుడతారట. చూడాలి మరి అందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో..

# అమరావతికి సాక్షికి సై

**ఆదాయ వనరుగా ఏపీ రాజధాని**

**ఒప్పేసుకున్న ప్రభుత్వ వ్యతిరేక మీడియా**

(ఓకే తెలుగున్యూస్)

అమరావతి రాజధానిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకంగానే ఉంటుంది. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ వ్యతిరేకమే. మొన్ననే అమరావతి బదులు మావిగన్ ప్రతిపాదన చేశారు జగన్మోహన్ రెడ్డి. మరోసారి రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని చెప్పుకొచ్చారు. అంతకుముందు మూడు రాజధానులు అనే తెరపైకి తెచ్చింది కూడా ఆయనే. టోటల్ గా చెప్పాలి అంటే అమరావతికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం. ఇక సాక్షి మీడియా గురించి చెప్పనవసరం లేదు. అమరావతికి వ్యతిరేకంగా పుంకాను పుంకాలుగా రాస్తూనే ఉంటుంది సాక్షి. అటువంటి మీడియాలో అమరావతికి అనుకూలంగా ఒక కథనం వచ్చింది. అమరావతి ద్వారా ప్రభుత్వం రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు ఇప్పటికే సమకూర్చుకుంది అనేది సాక్షి కథనం సారాంశం. ఓ వ్యతిరేక కథనంలో భాగంగా ప్రభుత్వానికి అనుకూలంగా మారిపోయింది దాని సారాంశం.

**చంద్రబాబు ఇంటి పక్కనే గ్రీన్ జోన్..**

అమరావతిలో చంద్రబాబు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. అన్ని రకాల వసతులతో ఈ భవన నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ భవనం పక్కనే మూడు వేల గజాలకు పైగా ఖాళీ స్థలాన్ని ఉంచారు. మరో నిర్మాణం జరగకుండా ఉండేందుకు గ్రీన్ జోన్ పరిధిలో చేర్చారు అని సాక్షి మీడియా ఒక కథనం రాసుకొచ్చింది. చంద్రబాబు కుటుంబానికి మేలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆ కథనంలో పేర్కొంది. ఈ నిర్ణయంతో సిఆర్డిఏ కు భారీగా నష్టం జరిగిందని కూడా చెప్పింది. అమరావతిలో ప్రస్తుతం గజం ధర 50వేల రూపాయలు అని.. చంద్రబాబు ఇంటి పక్కనే గ్రీన్ జోన్ పరిధిలో చేర్చడంతో 18 కోట్ల నష్టం జరిగిందన్నది ఈ కథనం సారాంశం. ఇప్పటివరకు అమరావతి అనేది అప్పుల కుప్ప అని.. దాని ద్వారా పూర్తిగా ఆదాయం రాదని తేల్చేసిన సాక్షి.. ఇప్పుడు అక్కడ గజం భూమిని 50 వేల రూపాయల రేటు కట్టిమరి అక్కడ ఉన్న విలువను చాటి చెప్పింది.



**సాక్షి కథనంలో..**

సాక్షి మీడియా నిత్యం అమరావతి పై విషం చిమ్ముతూ వచ్చింది. అయితే అమరావతి రాజధానికి భూమి సమీకరించిన ప్రభుత్వం.. తన వద్దే ఓ ఐదు వేల ఎకరాలను పెట్టుకుంది. అమరావతి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందు చూపుతో ఆలోచన చేసింది. అయితే గజం ధర 50 వేల రూపాయలు పలుకుతోంది అని అదే సాక్షి చెప్పింది. ఈ లెక్కన ప్రభుత్వం వద్ద ఉన్న భూమి విలువ అక్షరాల రెండున్నర లక్షల కోట్లు. అమరావతి రాజధాని నిర్మాణానికి రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని.. దాని ద్వారా రూపాయి ఆదాయం వచ్చే అవకాశం లేదు అని సాక్షి ఇన్నాళ్లు కథనాలు ప్రచురించింది. కానీ చంద్రబాబుపై వ్యతిరేక కథనం అల్లే క్రమంలో గజం ధర 50 వేల రూపాయలను చెప్పడం ద్వారా.. రాజధాని నిర్మాణం పూర్తి కాకముందే.. ప్రభుత్వం చేతిలో రెండున్నర లక్షల కోట్ల ఆదాయం ఉందని బయట పెట్టింది. అందుకే అంటారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సాక్షి మీడియా వరమో.. శాపమో అని..!

# ఏపీలో యుద్ధ విమానం

(ఓకే తెలుగున్యూస్)

ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు డిఆర్డిఓ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రక్షణ రంగంతో పాటు ఏరోస్పేస్ లో ముద్ర చాటుకోనుంది ఏపీ. సత్యసాయి జిల్లాలో ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది. సీఎం చంద్రబాబు ఈ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయింది. బెంగళూరుకు అతి సమీపంలో సత్యసాయి జిల్లా ఉండడం కలిసి వచ్చే అంశం. రక్షణ రంగంలో భారీ ప్రాజెక్టు జిల్లాకు కేటాయించడం అనేది విశేషమే. ఈ పరిశ్రమ ఏర్పాటుతో జిల్లా కూడా అభివృద్ధి చెందనుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగు పడనున్నాయి.

**భారీ పెట్టుబడితో..**

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో 15వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు ఇక్కడ తయారు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ( రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ) ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సీఎం చంద్రబాబు ఈనెల ఈ పరిశ్రమకు సంబంధించి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాకతో దేశంలో రక్షణ రంగం చిత్రపటంలో శ్రీ సత్య సాయి జిల్లాకు చోటు దక్కనుంది. దేశీయంగా అత్యాధునికంగా యుద్ధ విమానాలను ఇక్కడ తయారు చేయనున్నారు. రక్షణ రంగాలకు సంబంధించి ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ ఆర్మీ తోపాటు నావి ఈ యుద్ధ విమానాలను వినియోగించుకోనున్నాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సుఖోయ్ ఎస్ యు-30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా ఇక్కడ అత్యాధునిక విమానాలను తయారు చేయనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం 600 ఎకరాల భూమిని డిఆర్డిఓకు కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరార్థం మరో నాలుగు వందల ఎకరాలను అందుబాటులో ఉంచింది.



# పాపం ఆ ముగ్గురూ..

**రాజకీయాల్లో రాణించలేకపోయిన దిగ్గజ స్టార్స్**
**చిరంజీవి, రజనీకాంత్, కమల్ హాసన్**
**పర్వాలేదనిపించిన పవన్ కళ్యాణ్**
**ఫుల్ మార్క్ చూపిన విజయ్**

(ఓకే తెలుగున్యూస్)

తమిళనాడులో విజయ్ గెలుపు తర్వాత ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సినీ పరిశ్రమ నుంచి కొత్తగా రాజకీయ రంగంలోకి వచ్చేది ఎవరు? పార్టీని ఏర్పాటు చేసేది ఎవరు అనే దానిపై ఒక చర్చ నడుస్తుండగా.. రాజకీయాల్లోకి వచ్చి అవకాశాలు దక్కని సినీ హీరోల పై చర్చ నడుస్తోంది. ప్రధానంగా ఓ ముగ్గురు.. పొలిటికల్ స్క్రీన్ పై మెరవాలని చూశారు. కానీ అది సాధ్యపడలేదు. తిరిగి సినిమా స్క్రీన్ పైకి వెళ్ళిపోయారు. వారే మెగాస్టార్ చిరంజీవి, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, లోక నాయకుడు కమలహాసన్. ఈ ముగ్గురు ముగ్గురే. సినిమాల్లో విశేష ప్రభావం చూపి కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్నారు. కానీ పొలిటికల్ స్క్రీన్ పై మాత్రం ప్రభావం చూపలేకపోయారు.

**మెగాస్టార్ సైతం..**

తెలుగు నాట ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజారాజ్యం ఏర్పాటు చేశారు మెగాస్టార్ చిరంజీవి. ఉమ్మడి రాష్ట్రంలోనే పోటీ చేసి 2029 ఎన్నికల్లో 18 స్థానాలకు పరిమితం అయ్యారు. దాదాపు 70 లక్షల ఓట్లను సొంతం చేసుకున్నారు. కానీ పార్టీని పూర్తిస్థాయిలో నడపలేక కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. అయితే అప్పటికి ఉన్న రాజకీయ పరిస్థితుల్లో.. ప్రజారాజ్యం పార్టీ 18 సీట్లు సాధించుకోవడం గొప్ప విషయం అని విశ్లేషణలు ఉన్నాయి. అయితే ప్రజారాజ్యం పార్టీని కొనసాగించి ఉంటే 2014లో ఆ పార్టీ తప్పకుండా అధికారంలోకి వచ్చేదన్న అంచనాలు ఉన్నాయి. అయితే ప్రజారాజ్యం పార్టీకి కొనసాగింపుగా జనసేన వచ్చింది. అనుకున్నది సాధించింది కానీ పవన్ కళ్యాణ్ సోలోగా అధికారంలోకి రాలేకపోవడం అనేది లోటు.

**రాజకీయ నిష్క్రమణ..**

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వచ్చినట్టే వచ్చి.. తిరిగి సినిమా రంగంలోకి బ్యాకప్ అయ్యారు. నిలకడలేమి, మాట పడకపోవడం, సినిమాలపైనే ధ్యాస ఉండడంతో రజనీకాంత్ రాజకీయాల్లో ఇమడలేమన్న భావనకు వచ్చారు. తమిళనాడులో ఎక్కువ మంది అభిమానులను సొంతం చేసుకున్న సూపర్ స్టార్ రజినీకాంత్. కానీ రాజకీయాల్లోకి వచ్చి ప్రభావం చూపడం కంటే మాట పడకపోవడం ఆయన నైజం. అందుకే రాజకీయాలు సూటు కావని భావించి పార్టీ ప్రారంభించిన కొద్ది రోజులకే నిష్క్రమించారు. మరో లోకనాయకుడు కమలహాసన్ సైతం అదే పరిస్థితి. పార్టీని ఏర్పాటు చేశారు కానీ.. ఆశించిన దూకుడుగా ముందుకు వెళ్లలేదు. కాంగ్రెస్ తో పాటు డీఎంకేకు సపోర్ట్ చేసి పక్కకు తప్పుకున్నారు.

**సినిమాయే వారి ప్రాణం..**

అన్నింటికీ మించి ఈ ముగ్గురు సినిమాలను ఇష్టపడతారు. ప్రాణంగా ప్రేమిస్తారు. సినిమాలతో పోల్చుకుంటే రాజకీయాల పట్ల ప్రేమ చూపలేరు. అందుకే పొలిటికల్ స్క్రీన్ పై మరవలేకపోయారు. తిరిగి సినిమా స్క్రీన్ వైపే వెళ్ళిపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరు విజయ్ తో పాటు పవన్ కళ్యాణ్ తో పోల్చుకుంటే దిగ్గజాలు. కానీ సినీ పరిశ్రమ వరకే. సినిమాలు చేయకుండా ఉండలేరు కూడా. విజయ్ రాజకీయాల కోసం సినిమాలు వదులుకోవడానికి సిద్ధపడ్డారు. పవన్ కళ్యాణ్ సైతం అదే మాదిరిగా వ్యవహరిస్తుంటారు. కానీ ఈ ముగ్గురు సినిమాలను విడిచి పెట్టేందుకు అంగీకరించడం లేదు. అందుకే పొలిటికల్ స్క్రీన్ పై రాణించలేకపోయారు.

# దటీజ్ బాలకృష్ణ

(ఓకే తెలుగున్యూస్)


హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణది విలక్షణ శైలి. సినిమాల్లో అలవోకగా డైలాగులు చెబుతారు కానీ... నిజజీవితంలో మాత్రం అందుకు విరుద్ధం. చాలా తడబడుతూ మాట్లాడుతారు. అయినా సరే ప్రజలు ఆయనను ఇష్టపడతారు. అంతలా ఉంటుంది ఆయన పనితనం. అయితే రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంటారు బాలకృష్ణ. అది కూడా ఏదో అరుదుగానే. అప్పట్లో అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి తీరుపై ఎండగట్టే క్రమంలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్యల విషయంలో వైసిపి హయాంలో జగన్ వ్యవహరించిన తీరును తప్పుపడుతూ.. మధ్యలో మెగాస్టార్ చిరంజీవి ప్రస్తావన రావడం వివాదాస్పదంగా మారింది. అయితే అక్కడి నుంచి స్పందించే విషయంలో బాలకృష్ణ ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటున్నారు. తాజాగా ఆయన అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తన సొంత నియోజకవర్గం హిందూపురంలో పర్యటించారు. ఈ క్రమంలో విలేకరులు జగన్మోహన్ రెడ్డి పై స్పందించాలని కోరగా... బాలకృష్ణ స్ట్రాంగ్ రియాక్షన్ ఇచ్చారు.

**జగన్ మావిగన్ ప్రతిపాదనపై..**

మొన్న మధ్యన అమరావతి రాజధాని బదులు మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు జగన్మోహన్ రెడ్డి. దానిపై ఒక్క వైసీపీ నేతలు తప్ప మిగతా వారంతా వ్యతిరేకించారు. అదో పిచ్చి ప్రతిపాదనగా తేల్చేశారు. జగన్మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ కు గురయ్యారు. నెటిజెన్లు ఒక ఆట ఆడుకున్నారు. చివరకు అనుకూల విశ్లేషకులు, మీడియా ప్రతినిధులు సైతం తప్పుపట్టారు. అయితే తాజాగా దానిపై స్పందించాలని విలేకరులు నందమూరి బాలకృష్ణను కోరారు. కానీ ఆయన తన స్పందన నోటితో తెలియజేయలేదు. అదో వెర్రి ప్రతిపాదన అంటూ సంకేతాలు ఇచ్చారు. ముఖ కవళికలతో పాటు చాలా సింపుల్ గా తీసి పక్కన పెట్టేసారు. కనీసం మాట్లాడకుండానే బాలకృష్ణ అలా స్పందించేసరికి అందరూ ఆశ్చర్యపడ్డారు.

**సహజ శైలికి భిన్నంగా..**

ఏదైనా అంశాన్ని కుండ బద్దలు కొట్టి మాట్లాడడం నందమూరి బాలకృష్ణ కు అలవాటు. కానీ ఇటీవల ఆయన వ్యాఖ్యలను వివాదాస్పదం చేస్తున్నారు. అందుకే వీలైనంతవరకు మీడియాతో మాట్లాడడం లేదు బాలకృష్ణ. తాజాగా జగన్ మావిగన్పై కూడా బాలకృష్ణ తన సైగలతోనే సమాధానం చెప్పారు. చాలా సింపుల్ గా.. చాలా కూల్ గా.. ఒకే ఒక్క ముఖ కవళికతో తేల్చి చెప్పడం విశేషం. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టిడిపి శ్రేణులు విపరీతంగా వైరల్ చేస్తున్నారు. మాట్లాడకుండానే బాలకృష్ణ తన స్పందన తెలియజేయడం అందరినీ ఆకట్టుకుంటుంది.



# ఉత్తరాంధ్రకు గుడ్ న్యూస్!



***విశాఖ కేంద్రంగా దక్షిణ మధ్య కోస్తా రైల్వేజోన్***

***జూన్ 1 నుంచి అధికారిక కార్యకలాపాలు***

***గెజిట్ నోటిఫికేషన్ విడుదల***

(ఓకే తెలుగున్యూస్)

ఏపీకి మరో గుడ్ న్యూస్ చెప్పింది కేంద్ర ప్రభుత్వం. విశాఖ కేంద్రంగా దక్షిణ మధ్య తీర రైల్వే జోన్ కార్యకలాపాలు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. విభజన హామీల్లో భాగంగా ఈ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ పాలనాపరమైన అనుమతులు ఇప్పటికే జారీ చేసింది రైల్వే శాఖ. ఇప్పుడు అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించే వీలుగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజలకు ఇది శుభవార్త. ఎందుకంటే పుష్కర కాలానికి పైగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వానికి ఇది సానుకూల అంశం.

**విభజన హామీల్లో భాగంగా..**

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఏపీకి కొత్త రైల్వే జోన్ ప్రకటిస్తామని విభజన చట్టంలోనే పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన కూడా చేసింది. కానీ తర్వాత వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే జోన్ కు సంబంధించి భూముల కేటాయింపులో తీవ్ర జాప్యం చేసింది. దీంతో రైల్వే జోన్ ఏర్పాటు అనేది ఆలస్యం అయ్యింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపింది. రైల్వే జోన్ కు అవసరమైన భూములను అప్పగించింది. తాత్కాలిక భవనాలను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా.. దక్షిణ మధ్య తీర రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి అనుమతులు మంజూరు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ రైల్వే జోన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే గెజిట్ నోటిఫికేషన్ విషయంలో ఆలస్యం జరుగుతూ వచ్చింది. కానీ ఈ జూన్ ఒకటి నుంచి అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి కొత్త జోన్ పరిధిలో..

**కొత్తగా ఆ డివిజన్లతో..**

విశాఖ కేంద్రంగా కొత్తగా ఏర్పాటు అవుతున్న జోన్లో గుంతకల్లు, గుంటూరు, విజయవాడతోపాటు విశాఖ డివిజన్ లను కలపనున్నారు. ఇప్పటికే వాల్తేరు డివిజన్ ఉండగా దానిని రద్దు చేశారు. కొంత భాగాన్ని విజయవాడ జోన్లో చేర్చారు. మరికొంత భాగంతో విశాఖ డివిజన్ ఏర్పాటు చేశారు. ఇంకోవైపు కొత్త డివిజన్లో చాలా రైల్వేస్టేషన్లను విశాఖ డివిజన్లో చేర్చగా.. గతంలో వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న స్టేషనులు కొన్ని రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న కొత్త డివిజన్ లో చేర్చారు. ఇప్పుడు అధికారికంగా గెజిట్ రావడంతో విశాఖ నుంచి కొత్త రైల్వే సర్వీసులు, నూతన ఉద్యోగ నియామకాలు, అన్ని రకాల కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. నిజంగా ఇది శుభవార్త ఉత్తరాంధ్ర ప్రజలకు.

# ముగిసిన ముగ్గురి కథ



(ఓకే తెలుగున్యూస్)

రాజకీయాల్లో హత్యలు ఉండవు అంటారు. అన్ని ఆత్మహత్యలే అంటారు. ఇప్పుడు తమిళనాడులో స్టాలిన్ ఓటమి అలానే ఉంది. అహంకార పూరిత నిర్ణయాలు, ప్రత్యర్థుల అణచివేతలకు ప్రజలు ఇష్టపడరని తేలిపోయింది. తమిళనాడులో గెలుపు బాటలో ఉన్న అధికార పార్టీ డిఎంకె అనూహ్యంగా ఓడిపోయింది. ఎన్నికలకు ముందు నుంచే సర్వేలు, ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ లో ముందంజలో ఉండేది ఆ పార్టీ. కానీ ఆ అంచనాలకు భిన్నంగా దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. అయితే స్టాలిన్ ఓటమితో ఒక్క విషయాన్ని చెప్పగలం. తమిళనాడు ఫలితాలతో తెలుగు రాష్ట్రాలకు సంబంధాలు ఉన్నాయి. 2023లో కేసీఆర్ ఓడిపోయారు. 2024లో జగన్మోహన్ రెడ్డి ఓడిపోయారు. 2026లో స్టాలిన్ ఓడిపోయారు. ఈ ముగ్గురు స్నేహితులు. పరస్పర రాజకీయ ప్రయోజనాలకు సహకరించుకునేవారు. కానీ వీరి స్నేహం అహంకారపూరిత ద్వారానికి దారితీసింది ఒకరి నుంచి ఒకరికి. దాని పర్యవసానాలు ఆ పార్టీలకు ఓటములు.

**పెద్దదిక్కుగా కెసిఆర్..**

జగన్మోహన్ రెడ్డి తో పాటు స్టాలిన్ కు పెద్దదిక్కుగా ఉండేవారు కేసిఆర్. ముందుగా 2014లో ఆయన తెలంగాణలో అధికారంలోకి వచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా చంద్రబాబు అయ్యారు. కానీ చంద్రబాబు పెద్దన్న పాత్రను ఎంత మాత్రం ఇష్టపడేవారు కాదు కెసిఆర్. అలా ఆయన రాజకీయ ప్రత్యర్థి జగన్మోహన్ రెడ్డిని దగ్గరకు తీసుకున్నారు. చంద్రబాబుకు ఇబ్బంది పెట్టాలన్న కోణంలో జగన్మోహన్ రెడ్డికి ఎనలేని ప్రోత్సాహం అందించేవారు. అయితే ఇద్దరికీ ఒక సారూప్యత ఉండేది. అదే అహంకారపూరిత ధోరణి. అయితే కెసిఆర్ జగన్మోహన్ రెడ్డిని ప్రభావం చూపడం కంటే.. జగన్మోహన్ రెడ్డి కెసిఆర్ పై విపరీతంగా ప్రభావం చూపారు. 2014లో అధికారంలోకి వచ్చిన కెసిఆర్ తెలంగాణ సమాజంలో మంచి పేరు తెచ్చుకున్నారు. కానీ ఎప్పుడైతే జగన్మోహన్ రెడ్డితో స్నేహం చేశారో.. అప్పటినుంచి కెసిఆర్ సైతం ప్రజలకు దూరమయ్యారు. 2019 నుంచి 2024 వరకు జగన్మోహన్ రెడ్డి కూడా ప్రజలకు అందనంత దూరంగా ఉండి పాలన చేశారు. 2018 నుంచి 2023 వరకు కేసిఆర్ కూడా ప్రజలకు దూరమయ్యారు. తెలంగాణ ఉద్యమానికి సహకరించిన వారిని పక్కన పెట్టేశారు. కేవలం మేము అనే అహంకార ధోరణితో ముందుకు సాగడం వల్లే 2023లో ఓటమిపాలయ్యారు. అదే తీరుకు అలవాటు పడిన జగన్మోహన్ రెడ్డి 2024 లో ఓడిపోయారు.

**విపరీత ధోరణితో స్టాలిన్..**

సాధారణంగా చుట్టూ పెరిగే వాతావరణం, మన స్నేహితులు బట్టి మన నడవడిక ఉంటుంది. స్టాలిన్ విషయంలో కూడా అదే జరిగింది. కేవలం కెసిఆర్ తో పాటు జగన్ తో ఉన్న స్నేహం వల్లే ఆయన ఓడిపోయారు అనేది ఒక విశ్లేషణ. స్టాలిన్ సైతం తన చుట్టూ ఒక వలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు జగన్మోహన్ రెడ్డి మాదిరిగా. సామాన్యులకు దూరంగా ఉంటారన్న విమర్శను మూటగట్టుకున్నారు. ప్రజల మధ్య కాకుండా ప్యాలెస్ నుంచి పాలన సాగిస్తారన్న అపప్రద ఆయనపై ఉంది. ఆ కారణంతోనే ఆయన ఫెయిల్ అయ్యారు. ఇక్కడ మరో కారణం చూడాలి. ప్రత్యర్థులను అణగదొక్కడంలో ముగ్గురుకు ముగ్గురు సాటే. దాని పర్యవసానంగా ప్రత్యర్థులు రాజకీయంగా బలపడ్డారు. ఈ ముగ్గురు

# జూనియర్ ఎన్టీఆర్ ఎపిసోడ్ముగిసినట్టే

(ఓకే తెలుగున్యూస్)

తమిళనాడు ఎన్నికల ఫలితాలు వచ్చాయి. పివికే అధినేత విజయ్ అనూహ్య విజయం దక్కించుకున్నారు. ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కానున్నారు. పార్టీ ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల్లో అధికారంలోకి వచ్చి రికార్డ్ సృష్టించారు. ఇండియన్ సినిమా హిస్టరీలో నందమూరి తారక రామారావు తర్వాత అంతటి ఘనత సాధించారు. విజయ్ గెలుపుతో దేశంలో మిగతా సినీ నటులు రాజకీయ అరంగేట్రం చేసి.. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారన్న టాక్ ప్రారంభం అయింది. ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తరువాత ఛాన్స్ జూనియర్ ఎన్టీఆర్ అని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే పొలిటికల్ ఎంట్రీ కి జూనియర్ ఎన్టీఆర్ సిద్ధంగా ఉన్నారా అంటే మాత్రం సమాధానం దొరకదు. మునుపటి పరిస్థితి కూడా తెలుగుదేశంలో లేదు. అంతా సాఫీగా జరిగిపోయింది అధికార మార్పిడి. ఇప్పుడు అసలు జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావన పార్టీలో లేదు. అంతలా మారిపోయింది స్వరూపం. తెలుగుదేశం పార్టీలోకి జూనియర్ ఎన్టీఆర్ను తెచ్చి యాక్టివ్ చేయాలన్నది సీనియర్ల అభిప్రాయమే కాదు. మెజారిటీ పార్టీ శ్రేణులు కూడా దానినే కోరుకున్నాయి. అయితే అది ఇప్పుడు కాదు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ పార్టీలో జూనియర్ ఎన్టీఆర్ స్వరం వినిపించింది. అందుకు కారణం లోకేష్. ఆయన అప్పట్లో అంత పరిణితి చెందలేదు. అందుకే చంద్రబాబు తర్వాత జూనియర్ ఎన్టీఆర్ ఆప్షన్ గా ఉండేది పార్టీ శ్రేణులకు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయిన తరువాత జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రముఖంగా వినిపించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా నేతలు ఒక పద్ధతి ప్రకారం జూనియర్ ఎన్టీఆర్ పేరు తెరపైకి తెచ్చి చంద్రబాబును ఇరకాటంలో పెట్టారు. ఈ విషయంలో మాత్రం చంద్రబాబు ఎంతో సంయమనంతో వ్యవహరించారు. చాలా సహనంతో కూడా గడిపారు.



CM Revanth

కాంగ్రెస్ పార్టీ లో ఒక సంప్రదాయం ఉంటుంది. అధికారం లేనంతవరకు అధికారం కోసం కొట్లాడుతూ ఉంటుంది. అధికారం దక్కిన తర్వాత పదవుల కోసం ఆ పార్టీలో కొట్లాటలు జరుగుతూ ఉంటాయి. అందువల్లే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుంది అంటారు. కేవలం రాష్ట్రాలు మాత్రమే కాదు.. కేంద్రంలో కూడా అదేవిధంగా ఉంటుంది. అందువల్లే కాంగ్రెస్ పార్టీని సామాన్య ఓటరు అంతగా నమ్మనిది. కొంతమంది చరిష్మా ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీకి పెట్టని బలం మాదిరిగా ఉంటారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ బలం రేవంత్ రెడ్డి రూపంలో కనిపిస్తోంది. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బలమైన గొంతుగా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు కనిపించారు. అందువల్లే ఆయనను తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయంగా చూశారు. 2023 ఎన్నికల్లో ఆయన ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు అందించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏలమని కోరారు. తెలంగాణ ప్రజలు తీసుకున్న ఈ నిర్ణయం భారత రాష్ట్ర సమితి సుప్రీం కెసిఆర్ కు మింగుడు పడలేదు. అయినప్పటికీ ప్రజా తీర్పును శిరసా వహించాల్సి ఉంటుంది కాబట్టి తప్పలేదు.




# సెట్ రైట్ చేస్తున్న రేవంత్

**ఒకవైపు సంక్షేమ పథకాలు.. మరోవైపు కులాలకు కార్పొరేషన్ పదవులు**

**విశ్రాంత ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్.. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే దిశగా సంకేతాలు**

**ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు**

### రేవంత్ పెత్తనం పెరిగిపోయింది

తెలంగాణ రాష్ట్ర పగ్గాలు దక్కిన తర్వాత రేవంత్ రెడ్డికి అంత ఈజీగా ఏదీ లేదు. స్వపక్షంలోనే విపక్షం లాగా పరిస్థితి ఎదురయింది. సొంత పార్టీ నేతలు ఇబ్బంది పెట్టారు. ప్రత్యర్థి పార్టీలకు లీకులు కూడా ఇచ్చారు. ప్రభుత్వ పాలసీలను వివాదాస్పదం చేశారు. దీంతో అనేక రకాల వివాదాలు రేవంత్ రెడ్డిని చుట్టుముట్టాయి. ఎప్పుడైతే రేవంత్ రెడ్డి వరుస ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం మొదలుపెట్టారో.. అప్పుడే పరిస్థితి మారిపోయింది. అధిష్టానం కూడా రేవంత్ రెడ్డికి సరెండర్ అయిపోయింది.. దీంతో రేవంత్ రెడ్డి పార్టీ మీద పట్టు సాధించారు. తోక జాడిస్తున్న కొంతమంది పార్టీ పెద్దలకు చుక్కలు చూపించడం మొదలుపెట్టారు. దీంతో పార్టీలో ఎవరూ అంచనా వేయలేని విధంగా రేవంత్ పెత్తనం పెరిగిపోయింది.

ఇప్పుడు ప్రభుత్వంలో కూడా రేవంత్ తన దూకుడు తనం చూపిస్తున్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. ఇప్పటికే ఇందిరమ్మ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో గృహాలను నిర్మించారు. ఇంకా రెండవ దశ, మూడోదశలో కూడా గృహాలు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగులకు.. త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. రైతులకు సంబంధించి పంట పెట్టుబడి సాయం విషయంలో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. వాటిని కూడా అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు. సన్న ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఇవే కాకుండా త్వరలో చౌక దుకాణంలో ప్రజలకు జొన్నలు కూడా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.. సంక్షేమ పథకాల విషయంలో కొత్త ఒరబడి సృష్టిస్తున్న రేవంత్.. పార్టీ పరంగా నామినేటెడ్ పదవుల విషయంలో కూడా అదే జోరు చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయా కులాలకు కార్పొరేషన్లను కేటాయించారు. పదవులు కూడా భర్తీ చేశారు. త్వరలో మిగతా పోస్టులను కూడా భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రేవంత్ రెడ్డి అన్నిటిని సెట్ రైట్ చేసుకుంటూ వస్తున్నారు.

### ఆర్టీసీ కి కొత్త దారిని చూపించారు

దీర్ఘకాల సమస్యగా ఉన్న ఆర్టీసీ కి కొత్త దారిని చూపించారు రేవంత్. అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కార్మికులకు బకాయిలను చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాదు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు ఉన్న సమస్యలు మొత్తం అధిగమించాలని అధికారులకు సూచనలు చేశారు. అతి త్వరలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం ఖాయమని రేవంత్ సంకేతాలు ఇస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలోనూ రేవంత్ ఉదారత చూపిస్తున్నారు. అందువల్లే ఉద్యోగులు ఇటీవల ఆయనను సన్మానించారు. ప్రభుత్వ పరంగా ఉన్న బకాయిలను ప్రతినెల 6వేల కోట్ల చొప్పున చెల్లించేందుకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తద్వారా ఉద్యోగుల సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపించారు. పిఆర్సి.. ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్ పేర్కొన్నారు. పెరిగిపోయిన అప్పులు.. రాబడి విషయంలో ఏదో అవుతున్న సవాళ్లు.. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు.. ఇన్ని రకాల సమస్యలు ఉన్నప్పటికీ రేవంత్ సావధానంగా వెళుతున్నారు. తన కాళ్లలో పుల్లలు వేస్తున్నప్పటికీ వాటిని ఏరుకుంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదే దూకుడు కనక రేవంత్ కొనసాగిస్తే ఖచ్చితంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ని మించిన స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పేరు తెచ్చుకుంటారని కార్యకర్తలు అంటున్నారు.

### ఆర్టీసీ కార్మికులకు పెద్దపీట

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు పెద్దపీట వేస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మే 2026లో జరిగిన ముఖ్య సమ్మె కాలానికి వేతనాలు. కేసుల ఉపసంహరణ: ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, అలాగే సమ్మె సమయంలో నమోదైన పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**100% సమస్యల పరిష్కారం:** కార్మికుల సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని, వారి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.

నిధుల విడుదల: ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం1,000 కోట్లు విడుదల చేశారు.

**సంస్థ బలోపేతం:** ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహాలక్ష్మి పథకం ద్వారా 8,000 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

కొత్త బస్ టెర్మినల్స్: హైదరాబాద్ శివారులో 250 ఎకరాల్లో 2 భారీ అంతర్జాతీయ బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



**ఉద్యోగ భద్రత:** పెండింగ్‌లో ఉన్న వేతనాల పెంపు, ఇతర సమస్యలను అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని, ఎవరి ఉద్యోగాలకు ఢోకా లేదని భరోసా ఇచ్చారు.





# విజయ్ కి ఖర్చు తడిసిమోపెడు

» మహాబలిపురం రిసార్ట్ లోనే టీవీకే ఎమ్మెల్యేలు
» ప్రతిరోజూ లక్షల్లో వ్యయం.. ప్రభుత్వ ఏర్పాటు పై ఇంకా సందిగ్దత
» ఇంకొన్ని రోజులు రిసార్ట్ లోనే ప్రజాప్రతినిధులు
» మూడంచెల భద్రతను కల్పిస్తున్న టీవీకే నేతలు

తమిళనాడు ఎన్నికల్లో అక్కడి ప్రజలు ఏ పార్టీకి కూడా స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. కనీసం మ్యాజిక్ ఫిగర్ అవకాశాన్ని కూడా దూరం చేశారు. అతిపెద్ద పార్టీగా టీవీకే అవతరించినప్పటికీ.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం ఆ పార్టీ వద్ద లేదు. విజయ్ కి రాజకీయాలు కొత్త. రాజకీయాలు కూడా సినిమాలాగానే ఉంటాయని అనుకున్నాడు. కానీ అతని అంచనాలు అనుక్షణం తలకిందులవుతున్నాయి. ప్రజలు ఓట్లు వేసి గెలిపించినప్పటికీ.. విజయ్ అను నేను ప్రమాణ స్వీకారం చేయలేని దుస్థితి అతడిది. కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ ఇస్తామన్నప్పటికీ.. కమ్యూనిస్టులు ఒప్పుకోవడం లేదు.. ఏఐడీఎంకే బిజెపి కూటమిలో ఉంది కాబట్టి ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో విజయ్ పరిస్థితి అడ కత్తెరలో పోక చెక్క మాదిరిగా మారిపోయింది. గవర్నర్ కూడా ప్రభుత్వ ఏర్పాటుకు ఆమోదం తెలపడం లేదు. దీంతో విజయ్ తీవ్రమైన సంకట స్థితిలో పడిపోయారు.

> "రాజుగారి వస్త్రాల కంటే.. మీసాలకు రాసే సంపెంగ నూనె శిరో భారం అవుతోంది.. వెనుకటికి ఆదాయానికి మించిన ఖర్చు ఉంటే ఈ సామెతను వాడేవారు. ఇప్పుడు తమిళనాడు రాజకీయాలను చూస్తుంటే ఈ సామెతను వాడక తప్పదేమో అనిపిస్తోంది. ఎందుకంటే అక్కడి పరిస్థితులు అలా మారిపోయాయి."
>
> ఎనబోతుల భాస్కర్,
> ఓకే తెలుగు తెలంగాణ బ్యూరో చీఫ్

విజయ్ పరిస్థితి అలా ఉంటే.. ఎమ్మెల్యేలది మరో విధంగా ఉంది. డిక్లరేషన్ ఫాం అందుకున్న నాటి నుంచి ఎమ్మెల్యేలు మహాబలిపురంలోనే ఉండాల్సి వస్తోంది. కనీసం ఫోన్లు కూడా మాట్లాడే అవకాశం లేదు. నిరంతరం నిఘా ఉంది. సెక్యూరిటీ సిబ్బంది నిత్యం పహారా కాస్తున్నారు. రిసార్ట్ చుట్టూ మూడంచెల భద్రత ఉంది. విజయ్ గవర్నర్ వద్దకు వెళ్లినప్పుడు తాము కూడా వెళ్తామని ఎమ్మెల్యేలు అనుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఒప్పుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



ఒక సినిమా ఒప్పుకుంటే విజయ్ కోసం నిర్మాతలు కార్ వాన్ ఏర్పాటు చేయాలి. అందులోకి ఇతరులకు ప్రవేశం ఉండదు. పైగా విజయ్ వ్యక్తిగత సహాయకులకు కూడా అదే స్థాయిలో ఏర్పాటు చేయాలి. విజయ్ ఇంటి వద్ద నుంచి షూటింగ్ స్పాట్ వరకు ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చాలి. ఇన్ని చేసిన తర్వాత విజయ్ రిస్కీ షాట్లు చేసే అవకాశం ఉండదు. వాటికి డూప్ లను పెట్టాలి. ఇంతవరకు విజయ్ ఇటువంటి వాటి మీద అంతగా దృష్టి సారించలేదు. ఎందుకంటే ఖర్చు అతడిది కాదు కాబట్టి నిశ్శబ్దంగా చూస్తూ ఊరుకున్నాడు. రాజకీయాలలో అలా ఉండదు కదా.. ప్రతిదీ పార్టీ అధినేత పెట్టుకోవాలి. ఇక్కడ లెక్కలేసుకుంటే కుదరదు. అన్నట్టు సీఎం కుర్చీ అంటే సర్కార్ సినిమాలో మాదిరిగా లెదర్ కూషనింగ్‌తో ఉండదు. ఇదిగో దానికోసం ఇంత ఖర్చు పెట్టాలి. పది తలల శిరోభారాన్ని మోయాలి.

టీవీకే ఎమ్మెల్యేలు మహాబలిపురంలోని రిసార్ట్ లో ఉంటున్నారు. అత్యంత విలాసమైన విడిది కేంద్రం. ప్రతిరోజు దీని ఛార్జ్ లక్షల్లో ఉంటుంది. ఇక వంటకాల రేట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. కాంటినెంటల్, వెస్ట్రన్ వంటకాలను ప్రతిరోజు ఎమ్మెల్యేలకు సరఫరా చేస్తునట్టు తెలుస్తోంది. తమిళనాడులో ప్రత్యేకమైన వంటకాలు అయిన తట్ట ఇడ్లీ, పొంగనాలు, రవ్వ దోశ, మినప, పెసరట్టు, కుట్టు పరోట, ఇందులోకి చేపలు, నాటుకోడి, మటన్, గుడ్లు వంటి వాటిని వడ్డిస్తున్నట్టు తెలుస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు మాత్రం వెస్ట్రన్ వంటకాలు రుచి చూస్తున్నట్లు తెలుస్తోంది. మెక్సికన్, ఇటాలియన్ వంటకాలను కోరుకుంటున్నారు. గతంలో కూడా విజయ్ సభలో ప్రాణనష్టం చోటు చేసుకున్నప్పుడు.. బాధిత కుటుంబాలను విజయ్ ఈ రిసార్ట్ కి పిలిపించుకొని పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం చేశారు.

**లక్షలను దాటుతోంది**

ఇప్పటికే విజయ్ తన ఎమ్మెల్యేలను మహాబలిపురంలో ఉన్న రిసార్ట్ లో ఉండమని చెబుతున్నారు. అక్కడ ప్రతిరోజు ఖర్చు లక్షలను దాటుతోంది. సెక్యూరిటీ సిబ్బంది.. ఎమ్మెల్యేలకు రోజు వంటకాలు.. వారి వ్యక్తిగత సిబ్బందికి ఏర్పాట్లు .. ఇవన్నీ కూడా విజయ్ కి తలకి మించిన భారంగా మారిపోతున్నాయి. సాధారణంగా ఒక సినిమా ఒప్పుకుంటే విజయ్ వందల కోట్ల పారితోషకం తీసుకుంటారు. జననాయగన్ సినిమా కోసం 270 కోట్ల వరకు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి.

మహాబలిపురంలోని రిసార్ట్





హైదరాబాద్ జట్టు పూర్తిగా మారిపోయింది. ఏకంగా ఐపీఎల్లో టాప్ వన్ స్థానంలోకి వచ్చేసింది. ఇంకా రెండు మ్యాచ్లు కనుక గెలిస్తే హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్ వెళ్లిపోయినట్టు. హైదరాబాద్ జట్టు ఈ స్థాయిలో ఆట తీరు ప్రదర్శిస్తున్న నేపథ్యంలో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హైదరాబాద్ కంటే గొప్ప గొప్ప జట్లు ఈ ఐపీఎల్లో ఆడుతున్నప్పటికీ.. మొదట్లో ఓటములు.. ఆ తర్వాత వరుస విజయాలతో హైదరాబాద్ జట్టు తన భవితవ్యాన్ని పూర్తిగా మార్చేసుకుంది.

వరుస విజయాలతో సంచలనం సృష్టిస్తున్న హైదరాబాద్ జట్టు.. లీగ్ దశలోనే టాప్ స్థానాన్ని కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.. సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్ జట్టు ఫైనల్ వెళ్ళింది. గత ఏడాది కనీసం ప్లే ఆఫ్ దాకా కూడా వెళ్లలేకపోయింది. ఇక ప్రస్తుత సీజన్లో హైదరాబాద్ జట్టు ప్రారంభ దశలో అంత గొప్పగా ఆడలేదు. దీంతో గత సీజన్ మాదిరిగానే హైదరాబాద్ జట్టు ఆట తీరుకుంటుందని అభిమానులు ఒక అంచనాకు వచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్ జట్టు ప్లేయర్లు పూర్తిగా మారిపోయారు.

భారీ లక్ష్యాలను చేదించడం మొదలుపెట్టారు. బ్యాటింగ్ పైనే కాదు బౌలింగ్ పిచ్ లపై అదరగొట్టారు. ఇప్పటివరకు హైదరాబాద్ జట్టు 11 మ్యాచ్లు ఆడింది. ఇందులో ఏడు విజయాలు నెంబర్ చేసింది. పాయింట్లు పట్టికలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. అగ్రస్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టు.. ఆ ఒరవడి కొనసాగించాలని గట్టి నమ్మకంతో ఉంది.



# SunRisers Hyderabad

# కాటేరమ్మ కొడుకుల జైత్రయాత్ర

**అదరగొడుతున్నారు**

ఐపీఎల్ లో మోస్ట్ డేంజరస్ ఓపెనింగ్ ఎవరైనా ఉన్నారంటే అది అభిషేక్ శర్మ, హెడ్ మాత్రమే. ప్రారంభంలో హెడ్ ఇబ్బందిపడ్డాడు. అంత గొప్పగా ఇన్నింగ్స్ ఆడలేదు. అతడు ఆడలేక పోయే తీరును అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ ద్వారా కవర్ చేసేవాడు. ఇప్పుడు హెడ్ కూడా అదరగొడుతున్నాడు. హైదరాబాద్ జట్టుకు కీలక దశలో అతడు ఫామ్ లోకి రావడంతో తిరుగులేకుండా పోతుంది.



**త్రిమూర్తులు**

ఓపెనర్లు పరుగుల బోర్డును జస్ట్ 9 ఓవర్ల కల్లా సెంచరీ మార్క్ దాటిస్తున్నారు. ఆ తర్వాత కిషన్.. క్లాసెన్ భుజాలకు ఎత్తుకుంటున్నారు. మధ్యలో నితీష్ కుమార్ రెడ్డి కూడా వస్తున్నాడు. వీరు ముగ్గురు త్రిమూర్తుల మాదిరిగా బ్యాటింగ్ చేస్తూ.. హైదరాబాద్ జట్టుకు తిరుగులేని స్థానాన్ని అందిస్తున్నారు. మీరు మాత్రమే కాకుండా సలీల్ అరోరా, అనికేత్ వర్మ టచ్ లో ఉన్నారు. చివరి ఆర్డర్లో వీరు సిద్ధంగా ఉన్నారు. ఒకవేళ వీరికి గనుక అవకాశాలు లభిస్తే తిరుగు ఉండదు. వీరు చివరి ఓవర్లలో దుమ్ము రేపడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే వీరికి అవకాశాలు అరుదుగా మాత్రమే వస్తున్నాయి.

**బ్యాటింగ్లో మాత్రమే కాదు**

బౌలింగ్లో కూడా హైదరాబాద్ జట్టు అదరగొడుతోంది. దీనికి ప్రధాన కారణం ఇషాన్ మలింగ. పర్పుల్ క్యాప్ విభాగంలో అతడు పోటీ పడుతున్నాడు. ఇప్పటివరకు పోతాడు 16 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడిని చూసి ప్రత్యర్థి బ్యాటర్లు భయపడిపోతున్నారు అంటే.. బౌలింగ్ ఏ రేంజ్ లో వేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.



**సత్తా చూపిస్తున్నాడు**

గాయం వల్ల ప్రారంభ మ్యాచ్ లకు దూరంగా ఉన్న కెప్టెన్ కమిన్స్.. ఇప్పుడు సత్తా చూపిస్తున్నాడు. ఇతడు మాత్రమే కాకుండా సకిబ్ హుస్సేన్ ఇప్పటికే 10 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రతి మ్యాచ్లో అతడు వికెట్ పడగొడుతున్నాడు. ప్రఫుల్ హింగే 8 వికెట్లు, శివంగ్ 8 వికెట్లు, హర్ష్ 8 వికెట్లు సాధించి అదరగొడుతున్నారు.

**తిరుగులేని స్థాయిలో**

2025 సీజన్లో నితీష్ కుమార్ రెడ్డి అంతగా ఆడలేదు. తాను ఈసారి అతడు తిరుగులేని స్థాయిలో తన ప్రతిభను చూపిస్తున్నాడు. గత సీజన్లో 13 మ్యాచులు ఆడిన అతడు.. కేవలం 182 పరుగులు చేశాడు. రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఈ సీజన్లో మాత్రం పది మ్యాచ్లు ఆడిన అతడు 222 పరుగులు చేశాడు. 7 వికెట్లు పడగొట్టాడు.. ముఖ్యంగా క్లాసెన్ తో కలిసి అతడు అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. నితీష్ తన తొలి ఓవర్ లోనే వికెట్ తీస్తూ.. జట్టుకు అదిరిపోయే రిలీఫ్ ఇస్తున్నాడు.

**ఫీల్డింగ్ మీద ఫోకస్**

హైదరాబాద్ జట్టు 2016లో విజేతగా నిలిచింది. 2024లో ఫైనల్ దాకా వచ్చింది. ట్రోఫీని అందుకోలేకపోయింది. ఈ సీజన్లో హైదరాబాద్ జట్టు గతంలో కంటే గొప్పగా ఫామ్ లో ఉంది. అలాంటప్పుడు ఈసారి హైదరాబాద్ జట్టు ట్రోఫీ అందుకోవాలంటే కచ్చితంగా నాకౌట్ స్టేజ్ దాకా వెళ్లాలి. ఇది జరగాలంటే మిగిలిన మూడు మ్యాచ్లో కనీసం రెండిట్లో విజయాలు సాధించాలి.




**అన్నింట్లో విజయాలు సాధిస్తే**

ఒకవేళ అన్నింట్లో విజయాలు సాధిస్తే టాప్ రెండవ స్థానంలో ఉండవచ్చు. అప్పుడు ఫైనల్ వెళ్లడానికి హైదరాబాద్ జట్టుకు రెండు అవకాశాలు లభిస్తాయి. బ్యాటింగ్ బాగున్నప్పటికీ.. బౌలింగ్ అదరగొడుతున్నప్పటికీ.. ఫీల్డింగ్ విషయంలో హైదరాబాద్ జట్టు సత్తా చూపించాల్సిన అవసరం ఉంది. క్యాచ్ లు డ్రాప్ చేయకుండా ప్లేయర్లు ఫీల్డింగ్ మీద ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# ‘గోదారి గట్టుపైన’ రివ్యూ




మేం ఫేమస్ చిత్రంతో యూత్ ఆడియెన్స్‌కు చేరువైన సుమంత్ ప్రభాస్, సుదీర్ఘ విరామం తర్వాత నటించిన తాజా చిత్రం ‘గోదారి గట్టుపైన’. ఈ చిత్రం నేడు (మే 8, 2026) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే గోదావరి తీర ప్రాంత నేపథ్యంలో, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాల మధ్య దర్శకుడు సుభాష్ చంద్ర ఈ చిత్రంను తెరకెక్కించగా ఈ సినిమా ఎలా ఉందో ఇప్పుడు రివ్యూలో చూద్దాం.

## కథ

కోనసీమలోని ఓ మారుమూల గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు (జగపతిబాబు)కు తన కూతురు మాయ (నిధి ప్రదీప్) అంటే ప్రాణం. ఆమె సంతోషమే తన ప్రపంచంగా బ్రతుకుతుంటాడు. అయితే, మాయ జీవితంలోకి ఆటో డ్రైవర్ రాజు (సుమంత్ ప్రభాస్) ప్రవేశించడంతో కథ మలుపు తిరుగుతుంది. వీరిద్దరి మధ్య చిగురించిన ప్రేమ, భిన్నమైన సామాజిక నేపథ్యాల కారణంగా తండ్రీకూతుళ్ల మధ్య ఎలాంటి సంఘర్షణకు దారితీసింది? చివరకు ప్రేమ గెలిచిందా లేక తండ్రి బాధ్యత గెలిచిందా? అనేదే ఈ చిత్ర ప్రధానాంశం.

## నటీనటులు

తెలంగాణ యాసకు అలవాటు పడిన సుమంత్, ఈ సినిమాలో గోదావరి యాసను ఎంతో సహజంగా పలికించి ఆశ్చర్యపరిచారు. ఆటో డ్రైవర్ పాత్రలో ఆయన నటన పరిణతి చెందింది. కూతురి భవిష్యత్తు కోసం ఆరాటపడే సగటు తండ్రి పాత్రలో జగపతిబాబు మరోసారి తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. సినిమాకు ఆయనే ప్రధాన బలం. తొలి సినిమా అయినప్పటికీ, భావోద్వేగపూరితమైన సన్నివేశాల్లో నిధి చక్కటి ప్రతిభ కనబరిచారు.

నెల్లూరు సుదర్శన్ మార్క్ కామెడీ సినిమాకు పెద్ద ఎసెట్. బోరింగ్ సీన్స్‌లో కూడా తన పంచ్‌లతో థియేటర్‌లో నవ్వులు పూయించారు.

## సాంకేతిక విభాగం:

దర్శకుడు సుభాష్ చంద్ర పాత కథనే తీసుకున్నప్పటికీ, దానికి భావోద్వేగాలను అద్ది తెరకెక్కించిన తీరు బాగుంది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి అందాలను, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించింది. నాగవంశీ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాలను ఎలివేట్ చేయడంలో సక్సెస్ అయింది.

## విశ్లేషణ:

సినిమా ప్రథమార్థం ప్రేమకథ మరియు కామెడీతో సరదాగా సాగిపోతుంది. సెకండాఫ్ పూర్తిగా ఎమోషన్స్ మీద ఆధారపడింది. కొన్ని చోట్ల కథ నెమ్మదించినట్లు అనిపించినా, క్లైమాక్స్ వైపు వెళ్లేకొద్దీ తండ్రీకూతుళ్ల బంధం ప్రేక్షకులను కదిలిస్తుంది. “అమ్మ బాగుంటేనే ఇల్లు బాగుంటుంది”, “అతను ఫ్యాక్టరీకి కాదు.. కుటుంబానికి సెక్యూరిటీ గార్డ్” వంటి సంభాషణలు మనసును హత్తుకుంటాయి.

## ప్లస్ పాయింట్స్:

జగపతిబాబు, సుమంత్ ప్రభాస్ నటన.
హృదయానికి హత్తుకునే క్లైమాక్స్ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్.
ఆహ్లాదకరమైన విజువల్స్ మరియు పల్లెటూరి వాతావరణం.
నెల్లూరు సుదర్శన్ కామెడీ టైమింగ్.

## మైనస్ పాయింట్స్:

కథలో కొత్తదనం కొరవడటం
అక్కడక్కడా నెమ్మదించిన కథనం.

మొత్తానికి ‘గోదారి గట్టుపైన’ ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాగే ఒక స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రం. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి చూడదగ్గ ఒక పాజిటివ్ ఫ్యామిలీ డ్రామాగా దీనిని అభివర్ణించవచ్చు.

**రేటింగ్ : 2.5/5**

# మానస వారణాసి సొగసులు..



మాజీ మిస్ ఇండియా మానస వారణాసి తన సహజసిద్ధమైన అందం, హుందాతనంతో మరోసారి నెటిజన్ల మనసు గెలుచుకున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న కొన్ని ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి.ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో తీయించుకున్న ఈ ఫోటో షూట్‌లో మానస ఎంతో ప్రకాశవంతంగా కనిపిస్తున్నారు. ఒక చెట్టును ఆనుకుని నిలబడి, ఆమె చిలికించిన చిరునవ్వు అభిమానులను కట్టిపడేస్తోంది. “సూర్యరశ్మి, పట్టు వస్త్రాలు మరియు శుభప్రదమైన వైబ్స్” అంటూ ఆమె తన పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చారు.మిస్ ఇండియాగా దేశం గర్వించేలా చేసిన ఈ బ్యూటీ క్వీన్, కేవలం గ్లామర్ పరంగానే కాకుండా తన హుందాతనంతో కూడిన నటన, ప్రజెన్స్‌తో నిరంతరం ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. తాజా ఫోటోల్లో ఆమెలోని ఆ ‘నేచురల్ పోయిజ్’ చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### త్రిష కి కోలుకోలేని షాక్ ఇచ్చిన

# టీవీకే అధినేత విజయ్..



తమిళ హీరో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ రీసెంట్ గా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఒంటరిగా ఎన్నికల బరిలో దిగి, 5 దశాబ్దాల నుండి తమిళనాడు రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రవిడ పార్టీల కంచుకోటలు బద్దలు కొట్టి ముఖ్యమంత్రి కాబోతుండడం అనేది సాధారణమైన విషయం కాదు. అయితే ప్రభుత్వ ఏర్పాటుకి విజయ్ కు మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లు అవసరం ఉండగా , ఆయనకు కేవలం 114 స్థానాలు మాత్రమే దక్కాయి. అందుకే టీవీకే కి 107 స్థానాలు రాగా, కాంగ్రెస్ పార్టీ కి 5 స్థానాలు, మరియు ఇతర చిన్న పార్టీల నుండి 2 స్థానాలు తోడయ్యాయి. గవర్నర్ 118 సీట్లు ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటుకి అనుమతిని ఇస్తానని గట్టిగా చెప్పడంతో విజయ్ ప్రమాణస్వీకారోత్సవం వాయిదా పడింది.

ఇదంతా పక్కన పెడితే విజయ్ రాజకీయ పార్టీ ని స్థాపించడానికి ముఖ్య కారణమైన వ్యక్తి త్రిష. గత కొంతకాలంగా త్రిష తో ఆయన సహజీవనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్నీ విజయ్ ఎన్నికల ముందే అధికారికంగా చెప్పకనే చెప్పాడు. అయితే త్రిష కోరిక మీదనే పార్టీ పెట్టాడు అని తమిళ మీడియా లో జోరుగా ప్రచారం సాగుతున్న వేళ, ఆయన పార్టీ ఎన్నికల్లో గెలవగానే , కచ్చితంగా త్రిష కి ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తాడని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. విజయ్ త్రిచి ఈస్ట్, మరియు పెరంబూరు స్థానాల నుండి పోటీ చేసి గెలవగా , త్రిచి స్థానానికి ఆయన రాజీనామా చేస్తాడని, ఆ తర్వాత ఆ స్థానం నుండి త్రిష పోటీ చేస్తుందని , పోటీ చేసి గెలిచిన తర్వాత ఆమెకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తాడని , ఇలా ఎన్నో రకాలుగా ప్రచారాలు సాగింది.

ఇప్పుడు లేటెస్ట్ గా వినిపిస్తున్న టాక్ ఏమిటంటే, త్రిష ని తన క్యాబినెట్ లోకి తీసుకునే ఉద్దేశ్యం లో లేదట విజయ్. ఆమెని కేవలం పార్టీ అంతర్గత వ్యవహారాలకు మాత్రమే పరిమితం చేస్తే బాగుంటుందని, ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఆమెకు లేనిపోని నెగెటివిటీ ని తీసుకొని రావడం విజయ్ కి ఇష్టం లేదని కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న మాట. కానీ త్రిష కి మాత్రం రాజకీయాల్లోకి రావాలని, మంత్రి పదవి చేపట్టాలని కోరిక ఉంది. కానీ విజయ్ అకస్మాత్తుగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తో ఆమె కాస్త నిరాశకు గురైనట్టు కోలీవుడ్ లో వార్తలు వినిపిస్తున్నాయి. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఏమి జరగబోతుంది అనేది.

Printed and published by oktelugu Chairmen Bhaskar Rao Katiki, on behalf of Swarna Enterprises Private Limited. Hitec ciry, Hyderabad-500030.
Editor: A.Naresh email: oktelugu.com@gmail.com